# ప్రాయశ్చిత్తం

శ్రీ మొదలి వెంకటరామయ్య.

(క్రిందటి సంచిక తరువాయి)

"మీరింత త్వరగా వస్తారని అనుకోలేదు. మీ జాబు చేరింది. ఆ ప్రకారం సిల్కు కోసం ఆర్డరు ఇస్తామని అనుకొంటున్నాను" అన్నాడు. మాధవవర్మ తడుము కొంటూ, "రాత్రి లెటర్స్ వ్రాసి పోస్టు చేయడంలో, ఒక ముఖ్యమైన కాగితాన్ని తప్పు కవర్ లో పెట్టి పంపించాను. అది మీకేమైనా వచ్చిందేమోనని......" అని అర్థోక్తిలో నుండగానే, వర్తకుడు, అంతకు పూర్వమే వచ్చిన జాబును మాధవవర్మకు అందించాడు. దాన్ని ఆమూలాగ్రం చూచాడు మాధవవర్మ. ఆ జాబు కాదు. ఒక్క నిట్టూర్పు విడిచి, సెలవు దీసుకొని, ప్లీడరుగారింటి ముందు హాజరయ్యాడు. అచ్చటగూడా పరీక్షించాడుగాని ఫలితం సున్న. వెంటనే ఇంటికి చేరాడు. ఇంకెవరికి చేరుంటుంది. అయినా ఆశ ఉంది. కలకత్తా నుండి పూనానుండి జవాబులు రాలేదు.

నాలుగు రోజులయింది. జవాబులు వచ్చాయి. మాధవవర్మ ఆతురతతో కవర్లు మూడూ విప్పి చదివాడు. అతని ఆశలన్నీ అడుగంటాయి. ఆ జాబెవరికీ చేరలేదట. అయితే ఏమయింది? ఏమో! పొరపాటున గదిలోనే మరిచి పోయానేమో!" అనుకొని గదిఅంతా తెగ వెదికాడు. డ్రాయర్ పూర్తిగా గాలించి చూచాడు– లేదు. తప్పక తన గుట్టు బయట బడిందని నిశ్చయించుకున్నాడు. ఆ గుట్టు తెలిసినవారెవరో? అయినా కాలక్రమేణా తెలియకపోతుందా?

×

చీకటి రాత్రి. ఎనిమిది కావస్తోంది మాధవవర్మ భోజనంచేసి, పూలచెట్లమధ్యఉండే అరుగుమీద కూచోని, సిగరెట్ పీలుస్తున్నాడు. అంతటా నిశ్శబ్దం. దూరాన ఎండాకుల శబ్దమయింది. ఒకవ్యక్తి ఎదురుగా వస్తోంది. మాధవవర్మ నిదానించి చూచాడు. స్త్రీవ్యక్తి. పదహారేండ్లుంటాయి. తెల్లచీర కట్టుకోనుంది. మాధవవర్మ చకితుడై నిశ్చలంగా కూచున్నాడు. ఆ స్త్రీ వ్యక్తి మాధవవర్మకు ఎదురుగా నిలబడి, తన కుడి చేతినిచాపి, ఏదో తెల్లటివస్తువును ఆయనవేపు చూపుతూ, "తీసుకో" అన్నట్టు సంజ్ఞచేసింది. ఆయన ఆతురతతో, ఆవస్తువు అందుకొని, అగ్గిపుల్ల వెలిగించి చూచాడు. అది ఒకకవరు. దానిమీద తన అడ్రసే ఉంది. తాను తెలివితక్కువవల్ల పోగొట్టుకొన్న లేఖయేమోనని, కవరుచించి, కాగితంతీసి, మడతవిప్పి, అగ్గిపుల్ల వెలుతురులో చదువుతున్నాడు.

మాధవవర్మకు.

నీ రహస్యం నాకు తెలిసింది. ఇప్పుడు నీవద్దకు పంపిన అమ్మాయిద్వారా, నాకు వారమునకు వేయి రూపాయలు పంపించాలి. ఈమె ప్రతివారమూ ఇదే సమయాని కొస్తుంది. ఈ అమ్మాయికి మూగ, చెముడు కాబట్టి ఆమెను ప్రశ్నిస్తే నీకు లాభంలేదు. ఈమెను వెంబడించినా ఉనికి తెలుసుకొందామని ప్రయత్నించినా, నాకోరిక ప్రకారం ధనమును ఇవ్వకపోయినా, నీ రహస్యం రక్షకభటులకు తెలియజేస్తాను. జాగ్రత్త!"

క్రింద సంతకంలేదు. లేఖంతా, ఆగ్లంలో టైపు చేయబడిఉంది. కాబట్టి వ్రాసినవారెవరో కనుగొనడానికి వీల్లేదు. మాధవవర్మ నిరుత్తరుడైనాడు. తన రహస్యమెవరికో తెలిసిందని ఇప్పుడు స్పష్టమయింది. ఈ అమ్మాయిని ప్రశ్నిస్తామంటే లాభంలేదు. వెంబడింతామంటే ధైర్యం చాలలేదు. ఒక పావుగంట ఆలోచించాడు. గత్యంతరం లేక ఆ అమ్మాయిని

అచ్చటనే ఉండమని సంజ్ఞ చేసి, గదిలోకి వెళ్ళి పది నూరు రూపాయల నోట్లు తెచ్చి ఆమె చేతికిచ్చాడు. ఆమె వానిని పరీక్షించి, తన లెక్కకు సరిపోయాయనుకున్నట్టుగా, వెనక్కు తిరిగి చరచరా నడిచిపోయింది. ఆమె పోయినవేపే మాధవవర్మ చూస్తూ ఒక్క నిట్టూర్పు విడిచాడు.

మూడు నెలలు గడిచాయి మాధవవర్మ ఆదాయం లోంచి, వారానికి వేయిరూపాయలు తరుగుతూన్నాయి. మహాక్షోభిస్తోంది ఆయన మనస్సు. ప్రాణం పోయినా లెక్కలేదు కాని, ధనంపోతే ఆయన యమయాతన పొందుతాడు. “ప్రతివారం అంత ధనాన్ని అకారణంగా ఎందుకివ్వాలి? తన అవివేక ఫలితమిది. అయినా ప్రయత్నించి, తనను మోసంజేసే వ్యక్తి ఎవరో ఎందుకు తెలుసుకొనగూడదు? ఏమైనాగాని ఆ అమ్మాయిని వెంబడించి తెలుసుకోవాలి” అని నిశ్చయించుకున్నాడు.

సాయంత్రం ఏడు గంటలయింది. మాధవవర్మ ఆతురతతో ఆ అమ్మాయి ఆగమనాన్ని ఎదురుజూస్తున్నాడు. పావుగంట అయ్యేసరికల్లా ఆ అమ్మాయి వచ్చింది. ఆయన కెదురుగా నిలబడి చెయిజాపింది. నిశ్శబ్దంగా మాధవవర్మ నోట్లకట్ట నామె చేతికందించాడు. ఆమె గిరుక్కున తిరిగి దారిబట్టింది. మాధవవర్మ లేచి, మెయిన్ గేట్ గుండా రోడ్డు మీదికొచ్చి, ఎలెక్ట్రిక్ స్తంభం చాటున నుంచున్నాడు. ఆ అమ్మాయి చిన్న ద్వారంనుంచీ రోడ్డుమీదికివచ్చి ఒక సందులోకి తిరిగింది. మాధవవర్మ కాంపౌండ్ గోడ వెంబడేపోయి, ఆ సందులోకి తిరిగి, ఆ అమ్మాయిని అనుసరించి, చీకటిలో పోతున్నాడు. ఆ అమ్మాయి మూడు నాలుగు సందులు తిరిగి, ఒక భవనంవద్దకుపోయి, మేడమెట్లెక్కుతూ, మెట్ల తలుపులు తిన్నగామూసింది. మాధవవర్మగూడా సమయానికి మేడవద్దకు పోయాడు. తలుపు తిన్నగా నెట్టాడు. తీసిఉంది. మేడమెట్లెక్కాడు. ఆ అమ్మాయి ఒక గదిలో ప్రవేశించింది. కిటికీ తెరిచే ఉంది. మాధవవర్మ కిటికీవద్దకు పోయాడు. లోపల శబ్దం:—“హైమా! తెచ్చావు?” “ఆఁ! ఇవిగో!” “ఏవీ! చాలా అవసరంగా ఉంది!” అంటూ ఒకవ్యక్తి ఆ నోట్లను లెక్క పెడుతోంది.

మాధవవర్మ, ఆ అమ్మాయి మాట్లాడడం విని ఆశ్చర్యపడ్డాడు. కిటికీలోంచి నిదానించి చూచాడు. చూచేకొలదీ, అతనికి క్రోధం హెచ్చింది. ముఖం జేవురించింది. లోపల వసుంధరాదేవి టేబిల్ ముందు కూచోనుంది. మాధవవర్మ ఆపుకోలేక పోయాడు క్రోధాన్ని. ఇన్నాళ్లనుంచీ తన స్నేహితురాలిగా ఉండి, తనను గోతిలో తోయడానికి ప్రయత్నిస్తూన్న ఆ వసుంధరాదేవిని ఏంజేసినా పాపం లేదనుకున్నాడు. తన రహస్యాన్ని బయట పెడుతుందనే విషయాన్ని కూడా లక్ష్యం జేయకుండా, సాహసించి గదితలుపు విసురుగా లోపలికి నెంటి ప్రవేశించాడు గదిలోకి. ఈయన వస్తాడని కలలోనైనా అనుకోలేదు వసుంధరాదేవి. కాబట్టి కొంచెం భయపడింది. కాని, భయాన్ని పైకికనబడనీయకుండా దాచి, నోట్లను డ్రాయర్ లో పెట్టి, మందహాస పూర్వకంగా ఆయన్ను ఆహ్వానించింది. కాని మాధవవర్మ ఆహ్వానాన్ని అందుకోకుండానే—

“వసుంధరా! నీవేమో స్నేహితురాలివనుకొన్నాను. కృతఘ్నురాలివి. ఇన్నాళ్ళనించీ నన్ను పీక్కు తింటున్నావు! నామనస్సు కెంత కష్టం కలిగించావో తెలుసునా? నిన్ను ముక్కలుగా నరికినా పాపం లేదు. నన్ను మోసంచేసి డబ్బు తీసుకోకపోతే, అడిగితే నేనివ్వనూ? నారహస్యలేఖను గురించి జాబు వ్రాస్తే వ్రాశావు,—ఇంత ద్రోహం చేస్తావా?” అని ఇంకేమో ఉద్రేకంలో మాటాడబోతున్నాడు. వసుంధరాదేవి ఆయన్ను బలవంతాన కుర్చీలో కూర్చొనబెట్టి “మాధవవర్మగారూ! ఎందుకలా గింజుకుంటారు? మీవద్ద లక్షలు లక్షలు ధనం ఉండగాన్నే

మాత్రం తీసుకోనగూడదూ? స్త్రీని గాబట్టి అడగడానికి ధైర్యం చాలక ఇలా నే చేశాను. తప్పేమో మీరే చెప్పండి!" అంది నవ్వుతూ. మాధవవర్మ నిలబడే "నేనిచ్చట నిముషం గూడా ఉండడానికి వీలులేదు. నా రహస్యలేఖ నాకిచ్చెయ్యి. లేకుంటే "........" అని అంటూండగానే, వసుంధరాదేవి, "వర్మగారూ! నన్ను బెదిరించకండి. మీరంత కఠినంగా మాట్లాడితే నేనుమాత్రం తీసిపోతానా? నేనివ్వను. ఏమోకమైనా చెయ్యండి! సిద్ధంగా ఉన్నాను. ఈ క్షణంలో మిమ్ములరక్షకభటుల వశం చెయ్యగలను. మీభావి జీవితమంతా నా చేతిలో ఇమిడుంది" అంది.

మాధవవర్మ నిరుత్తరుడై తన స్థితికి చింతిస్తూ, హీన స్వరంతో "వసుంధరా! నన్నెందుకు బాధిస్తావు. నీవేంగావాలంటే అదిస్తాను. నా జీవిత సౌఖ్యాన్ని ధ్వంసంజేసి, నా ప్రాణాలు తీస్తే నీకేం లాభం! కాబట్టి నా లేఖ ఇచ్చెయ్! అది నాచేతికి వచ్చేవరకూ నాకు నిద్రపట్టదు. దానికోసం ఎన్ని బాధ లనుభవించానో నీకేం తెలుసు" అన్నాడు ఆవేదనతో.

వసుంధరాదేవి తన పట్టు నెగ్గుతూన్నందుకు సంతోషిస్తూ "అయితే! ఏం కావలిస్తే అది యిస్తారు? తప్పకుండా" అని ప్రశ్నించింది.

"ఆ! తప్పకుండా! శక్తికి మించకపోతే ఇస్తాను."

"అయితే యిలా చూడండి! ఇదివరకు నన్ను వివాహం చేసుకోమని చాలసార్లు ప్రాధేయపడితే మీరు నిరాకరించారు. అందుకు నేను మీమీద పగ సాధించడానికే ఇలా మోసంచేశాను. ఇప్పుడైనా మీరు నన్ను వివాహమాండడి. అలా మీకు ఇష్టం లేకపోతే, మీకున్న మొత్తం ఆస్తిలో నాకు సగం ఇవ్వండి. ఈ రెంటిలో దేనికైనా అంగీకరిస్తే సరి లేకుంటే మీ యిష్టం."

మాధవవర్మకు క్లిష్ట సమస్య ఏర్పడింది. వివాహమాడడానికి మనసొప్పదు. ఆస్తి ఇవ్వడానికీ మనసొప్పదు. హఠాత్తుగా కుర్చీమీద నించీ లేచి మాధవవర్మ!-"ఆ! సగం ఆస్తీ! నేనివ్వను. ఎంత సాహసించి అడిగావు!"

"అయితే వివాహ మాడండి!"

"నిన్నా! నావల్ల గాదు వసుంధరా! నాకసలు వివాహమే అవసరంలేదు.

"అయితే మీ యిష్టం" అంటూ వసుంధర నాలుగడుగులేసింది. మాధవవర్మ ఆమె నాపి కుర్చీమీద కూచోబెట్టాడు. ఆమె రెండుచేతులూ పట్టుకొని, "వసుంధరా, ఇంత కఠినంగా మాట్లాడకు వివాహం మాట ఎత్తకు. నన్ను రక్షించు. నీకు కావాలిస్తే కొంత ధనమిస్తాను."

"అవసరం లేదు. సగం ఆస్థి ఇవ్వండి! లేకుంటే వివాహమాడండి! రెండే షరతులని మొదటనే చెప్పాను గాదూ! నేను ఆడితప్పే దాన్ని గాను."

"ఆస్తి యెన్నడూ ఇవ్వను."

"అయితే వివాహమాడండి!"

"తప్పదూ?"

"తప్పదు! ఎంతమాత్రం తప్పదు!"

"సరే! వివాహమాడతాను. నా లేఖ ఇయ్యి!"

"అలా గాదు! మీరు నన్ను వివాహం చేసుకొని, మన వివాహాన్ని రిజస్టరుచేయించితే, ఆరోజు సాయంత్రం మీ లేఖ ఇచ్చేస్తాను."

"అదుగో! మళ్లీ మాట తప్పుతున్నావు? నేను మాట ఇస్తే అదే చాలు. మరల రిజస్టరెందుకూ? ఒద్దు వసుంధరా! నామాట విను! నాబుర్ర తిరిగిపోతోంది."

"అలా కాదు! మీరు తర్వాత మనస్సు మార్చుకొంటే నాగతేం కావాలి? కాబట్టి మీరు వివాహాన్ని రిజస్టరు చేస్తేనే గాని నేను లేఖ ఇవ్వను."

మాధవవర్మ విధిలేక ఒప్పుకొన్నాడు.

"అయితే వివాహమెప్పుడు?"

"వచ్చే సోమవారం నాడు."

"సరే! వెడతా!"

"మరిచిపోకండి!"

వివాహమయింది. తలవని తలంపుగా జరిగిన యీ వివాహాన్ని గూర్చి లోకులు అతి విచిత్రంగా చెప్పుకొంటున్నారు.

నూతన దంపతుల గృహ ప్రవేశం; విందులు మొదలైన వేడుకలన్నీ సలక్షణంగా జరిగాయి.

వసుంధరాదేవి ఈజీ చేరులో కూచుంది. మాధవవర్మ తీక్షణంగా ఆమెవేపు జూస్తూ, "వసుంధరా! పట్టునెగ్గించుకున్నావు. ఇక మన కాంట్రాక్టు ప్రకారం జాబు వాకిచ్చెయ్!" అన్నాడు.

వసుంధరాదేవి నవ్వుతూ, "అవునండీ! మొగాళ్లు ఏపని జేసినా ఫరవాలేదు గాని, స్త్రీ ఏం జేసినా ఇలానే అంటారు. సరే లెండి! మీరుమాత్రం మీ పట్టు నెగ్గించుకోలేదూ?"

మాధవవర్మ విసుగుతో వసుంధరా! ఇక ఆగడానికి వీలులేదు. నాజాబిచ్చెయ్! మాట తప్పకుండా!"

"ఎందుకంత కంగారు పడతారు? తమాయించండి! మీరు బాధపడుతూంటే నేనుమాత్రం ఓర్వగల నా ఏమిటి? మీ భార్యనవాలని ఎంతకాలం నుంచో ప్రయత్నిస్తోంటే అది నేటికి సిద్ధించింది. ఇక మీరు లభించిన తర్వాత జాబుతో ఏంపని నాకు!"

"ఏమిటా ఉపన్యాసం? ముందా కాగితమిచ్చి తర్వాత ఏమైనా చెప్పు వింటాను.

"అబ్బా! ఏమిటంత తొందర! మిమ్ముల మోసం జేస్తాననుకొన్నారా? ఆమాత్రం నమ్మలేరు గాబోలు! ఇదుగో తీసుకోండి!" అంటూ ఒక డ్రాయర్ తెరచి దానిలో ఒక సంచీ తీసి, దానిలోని కవరును మాధవవర్మ కందించింది. ఆయన దాన్ని ఆతురతతో తీసుకొని, లోపల కాగితం బయటికితీసి పరీక్షిస్తున్నాడు.

"అదేనా మీ జాబు! జాగ్రత్తగా చూచుకోండి! తర్వాత నన్నంటే లాభంలేదు."

"ఆమాటలు విని మాధవవర్మ ఆజాబును జాగ్రత్తగా చూచి "తనదే" అనట్టుగా తల ఊపి, జాబుకేసి వసుంధరకేసి నిప్పులు కక్కుతూ చూచి, ఆకోపం ఆ జాబును సహస్ర శకలాలుగా చేశాడు. ఆయన చర్యంతో ఆశ్చర్యంతో చూస్తోందామె. ఆయన ముక్కలను పదిలంగా ఒకచోట పెట్టి, జేబులోంచి అగ్గిపెట్టెతీసి, పుల్ల వెలిగించి, ఆ ముక్కల కంటించి, అవి మసి అయ్యేవరకూ వానివేపే చూస్తున్నాడు. అవి పూర్తిగా కాలిన తర్వాత, ఆమసి కాలితో నేలకు రాచి, ఆ జాబును భస్మంచేసిన, జయసూచకమైన దృష్టులతో," వసుంధరా! నా హృదయాన్ని ఎంత కలవర పరిచావు!" అంటూ కుర్చీలో కూలబడ్డాడు.

